సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం, 2, ఆగస్టు, 2024



డీటీకి షోకాజ్ నోటీసు

వరద బాధితులకు అందించాల్సిన సరుకులను దారి మళ్లించిన వ్యవహారంపై సివిల్ సప్లయిస్ డీటీ సురేంద్రకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 8లో



బైక్ దొంగల అరెస్టు

ఏలూరు వన్‌టౌన్ సర్కిల్ పరిధిలో మోటారు సైకిళ్లను చోరీ చేస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. 6 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. 8లో



జల్లేరులో జలకళ

బుట్టాయగూడెం : గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయానికి భారీగా వరద నీరు వస్తోంది. గురువారం 200 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

చిట్టిరాజుకు ఘన స్వాగతం



భీమవరంలో ఊరేగింపుగా తీసుకువస్తున్న దృశ్యం

భీమవరం: యూపీఎస్సీ సివిల్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఐపీఎస్ సాధించి తొలిసారిగా భీమవరం వచ్చిన శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కుమారుడు చిట్టిరాజుకు అఖండ స్వాగతం లభించింది. గురువారం సాయంత్రం పట్టణంలోని ఉండి రైల్వే గేటు వద్ద నుంచి గునుపూడి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. చిట్టిరాజుకు భారీ గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం గునుపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహానికి చిట్టిరాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు. మోషేన్‌రాజు అనుచరులు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఫెర్రీ వేలం ప్రారంభ ధర రూ.2.97 కోట్లు



జేఏసీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: నరసాపురం మండలపరిషత్ ఆధీనంలోని మాధవాయిపాలెం ఫెర్రీకి త్వరలో వేలం పాట నిర్వహించేందుకు జేఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉభయగోదావరి జిల్లాల జేఏసీ సమావేశంలో వేలం ప్రారంభ పాట ధర రూ.2,97,83,217లుగా తీర్మానించినట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ వీకే వీరభద్రరావు తెలిపారు. 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మిగిలిన కాలానికి ప్రారంభ పాట ధరగా రూ.3.61 కోట్లుగా అధికారులు నిర్ణయించి ఇప్పటికే మూడుసార్లు టెండర్లు పిలిచినా పాటదారులు ఆసక్తి చూపలేదు. దీంతో జేఏసీ మరలా సమావేశమై గత ప్రారంభపు పాట ధర కంటే సుమారు రూ.63 లక్షలు తగ్గించి వేలం నిర్వహించాలని నిర్ణయించారు. అయితే ఉన్నతాధికారులు ఈ తీర్మానాన్ని ఆమోదిస్తారా, టెండర్లు పిలిస్తే పాటదారులు ఆసక్తి చూపుతారా అన్నది వేచి చూడాలి. సమావేశంలో నరసాపురం ఎంపీపీ, జెడ్పీటీసీ మైలాబత్తుల సోనీ, బొక్కా రాధాకృష్ణ, నరసాపురం, అమలాపురం డీఎల్పీఓలు శ్రీనివాస్, బొజ్జిరాజు, ఎంపీడీఓ పీవీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

రేషన్ పక్కదారి సహించం

ముసునూరు : ప్రజలకు సక్రమంగా అందించాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడితే సహించమని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి హెచ్చరించారు. కాట్రేనిపాడులో రేషన్ షాపు, రేషన్ వాహనాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. స్టాకును పరిశీలించి, రేషన్ సరుకుల పంపిణీపై స్థానికులను ఆరా తీశారు. సివిల్ సప్లయిస్ డీటీ వెంకటేశ్వరరావు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడి

ఏలూరు(మెట్రో): మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా నాణ్యమైన దిగుబడి పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. గురువారం జిల్లాలోని వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులకు ఇండిగాప్ సర్టిఫికేషన్ ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పొలంబడి ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారులను కోరా రు. పొలంబడి మాస్టర్, ఏలూరు ఏడీఏ ట్రైనర్ వై.సుబ్బారావు, డాట్ సెంటర్ కో–ఆర్డినేటర్ ఫణికుమార్, సీనియర్ విత్తన సర్టిఫికేషన్ అధికారి యుగంధర్ ఇండిగాప్ సర్టిఫికేషన్ నియమావళి ప్రకారం నిర్వహించాల్సిన రికార్డులు, పాటించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు.

27 మి.మీ సగటు వర్షపాతం

ఏలూరు(మెట్రో): జిల్లాలో 27 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. లింగపాలెం మండలంలో అత్యధికంగా 122.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా మండవల్లి మండలంలో అత్యల్పంగా 0.6 మి.మీ వర్షం కురిసింది. చాట్రాయి, ఆగిరిపల్లి మండలాల్లో మినహా మిగిలిన 26 మండలాల్లో వర్షపాతం నమోదైంది. టి.నరసాపురంలో 80.2 మి.మీ, ద్వారకాతిరుమలలో 69.4 మి.మీ, పెదవేగిలో 58.6, చింతలపూడిలో 57.2, కామవరపుకోటలో 55.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఉపాధ్యాయులకు అవార్డులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని ఉపాధ్యాయులకు అవార్డులు ఇచ్చేందుకు విద్యాశాఖ నిర్ణయించిందని, ఈనెల 5 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని డీఈఓ ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్‌ఎంలు దరఖాస్తులను ఈనెల 9 వరకు తీసుకుని డీఈఓ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు.

ఉపాధి.. వేతనమేదీ?

కూలీల వేతన రోదన
- రెండు నెలలకుపైగా అందని వేతనాలు
- జిల్లాలో రూ.45.51 కోట్ల బకాయిలు
- జూలై నెలాఖరు వరకు 29.36 లక్షల పనిదినాల కల్పన
- మే 20 నుంచి నిలిచిన చెల్లింపులు



ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలు

సాక్షి, భీమవరం : నెలల తరబడి వేతనాలు అందక ఉపాధి హామీ పథకం కూలీలు ఆకలికేకలు పెడుతున్నారు. ఎండనకా వాననకా రెక్కలు ముక్కలు చేసుకున్నా కూలి డబ్బుల కోసం నిరీక్షణ తప్పడం లేదంటున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి జిల్లాలో వేతన బకాయిలు కోట్లలో పేరుకుపోవడంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు.

పేదవర్గాల వారి వలసలను నియంత్రించి, స్వగ్రామంలోనే పనులు కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలుచేస్తోంది. ఏడాదిలో ఒక్కో కుటుంబానికి వంద రోజులు పనిదినాలు కల్పించాలన్నది ఈ పథకం లక్ష్యం. పనికావాలని అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. జిల్లాలో ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగిన కూలీలు 1,78,329 మంది ఉండగా వీరిలో ఉపాధి పనులకు హాజరవుతున్న కూలీలు 94,465 మంది ఉన్నారు. చేసిన పనిని బట్టి సగటున రోజుకు రూ.250లు వరకు వేతనం అందిస్తున్నారు.

42 లక్షల పనిదినాల కల్పన లక్ష్యం

2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.126 కోట్ల విలువైన 42 లక్షల పనిదినాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఈ ఏడాది చేపట్టాల్సిన పనులకు సంబంధించి గతంలోనే ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు వ్యవసాయ, అనుబంధ అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తూ కూలీలకు పని కల్పిస్తున్నారు. మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పనులు చేపడుతున్నారు. సాధారణంగా పనిచేసిన తర్వాత జాబ్‌కార్డు హోల్డర్ ఆధార్‌కార్డు లింకై ఉన్న బ్యాంకు అకౌంట్, పోస్టాఫీసుకు రెండు నుంచి వారం రోజుల్లోపు కూలీ సొమ్ములను జమ చేస్తుంటారు. ఎన్నికల ముగిసిన తర్వాత మే 20వ తేదీ వరకు వేతన చెల్లింపులు సవ్యంగానే సాగినా తర్వాత నుంచి నిలిచిపోయాయి. దీంతో రెండు నెలలుపైగానే కూలీలకు వేతనాలు అందని పరిస్థితి నెలకొంది.

రూ.45.51 కోట్ల బకాయిలు

జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో జూలై నెలాఖరవు నాటికి రూ.79.12 కోట్ల విలువైన 29,36,000 పని దినాలు కల్పించారు. మే 20 నాటికి రూ.33.61 కోట్లు చెల్లింపులు పూర్తయ్యాయి. అప్పటి నుంచి ప్రభుత్వం కూలీ సొమ్ములు జమచేయకపోవడంతో రూ.45.51 కోట్లు మేర బకాయిలు పేరుకుపోయాయి. ఒక్కో కూలీకి రూ.2,000 నుంచి రూ.6,000 వరకు వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇవి ఎప్పుడు వస్తాయో తెలీని దుస్థితితో కూలీలు ఎదురుచూపులు చూడాల్సి వస్తోంది.

ఉపాధి హామీ పనుల తీరు

జిల్లాలో జాబ్ కార్డులు	1,78,329
పనుల లక్ష్యం	రూ.126 కోట్లు
పనిదినాల కల్పన లక్ష్యం	42 లక్షలు
జూలై నెలాఖరు వరకు పనులు పూర్తి	రూ.79.12 కోట్లు
పనిదినాల కల్పన	29.36 లక్షలు
వేతన బకాయిలు	రూ.45.51 కోట్లు

బకాయిలు వెంటనే చెల్లించాలి

మే నెల నుంచి ఉపాధి పనికెళ్తున్నాం. రెండు నెలలకు పైగా బకాయిలు ఉండిపోయాయి. వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. బకాయిలు వెంటనే చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పి.పేతురు, వేంద్ర, పాలకోడేరు మండలం

రూ.5 వేల వరకు రావాలి

పనులు చేసి దాదాపు రెండు నెలలు అవుతుంది. రూ.5 వేల వరకు రావాల్సి ఉంది. వర్షాల వలన ప్రస్తుతం సరిగా పనులు లేక ఇబ్బంది పడుతున్నాం. బకాయిలు వేస్తే కుటుంబానికి కొంత ఆసరాగా ఉంటుంది.

– కడలి జోగారావు, తూర్పుపాలెం, పోడూరు మండలం

గత ప్రభుత్వంలో సకాలంలో జమ

గత ప్రభుత్వంలో వేతనాలకు ఇబ్బంది ఉండేది కాదని, సకాలంలో ఖాతాలకు జమయ్యేవని ఉపాధి కూలీలు అంటున్నారు. బకాయిల విడుదలకు కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన కూటమి ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తుందన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులు జరుగుతుండటంతో కొందరికి ఉపాధి దొరుకుతున్నా వరదలు, వర్షాలతో చాలామందికి పనుల్లేవు. దీనికితోడు చేసిన పనికి కూలి సొమ్ములు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. బకాయిల విడుదలకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతున్నారు. దీనిపై డ్వామా పీడీ ప్రభాకరరావును సంప్రదించగా రావాల్సిన బకాయిలపై ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. నిధుల విడుదలకు కృషి చేస్తున్నామని చెప్పారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



భీమవరం ఏరియా ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం : పుట్టిన బిడ్డకు తల్లిపాలు పడితే బిడ్డతో పాటు తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం భీమవరం ఏరియా ఆస్పత్రిలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బిడ్డలకు అమృతంలా పనిచేసే తల్లిపాలు కనీసం ఆరు మాసాలు వరకు అందించాలన్నారు. తల్లిపాలు అందించడం ద్వారా యాంటీ బాడీస్ వృద్ధి చెంది బిడ్డలు ఆరోగ్యకరంగా ఉంటారని, తల్లిపాలకు దూరమైన పిల్లలు న్యుమోనియా, డయేరియా వంటి వ్యాధుల బారినపడే ప్రమాదముందన్నారు. పాలు ఇచ్చే తల్లులు, గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం తీసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహద పడాలని కోరారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డలకు టీకాల మాదిరిగా పనిచేస్తాయని, పిల్లలు దృఢంగా, ఆరోగ్యంగా పెరుగుతారన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి పి.సుజాతరాణి, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.మాధవి కళ్యాణి, చెరుకువాడ రంగసాయి, డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

పింఛన్‌తో అభాగ్యులకు ఆసరా

కలెక్టర్ నాగరాణి



వృద్ధురాలికి పింఛన్ సొమ్ములు అందిస్తున్న కలెక్టర్

భీమవరం: ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ వృద్ధులు, దివ్యాంగులకు ఆసరాగా నిలుస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం భీమవరం పట్టణంలోని 7వ వార్డు మారుతీనగర్ లెప్రసీ కాలనీలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను ఆమె పంపిణీ చేశారు. ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ మొత్తాన్ని పెంచి ఆసరాగా నిలిచిందన్నారు. అనంతరం లెప్రసీ కాలనీలో బాధితుల ఇళ్లకు వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కాలనీలో ఇబ్బందులపై ఆరా తీశారు. పిల్లలను బడికి పంపాలని సూచించారు. ఈ సందర్భంగా కొందరు కాలనీవాసులు తమకు ఇళ్లు లేవని, మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నామంటూ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గృహాలు అవసరమైన వారిని ట్యాగింగ్ చేయాలని, అలాగే మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామలను ఆదేశించారు. డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, ఏపీఓ పెన్షన్ టి.మురళీకృష్ణ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'మా పెన్షన్లు ఆపేశారు'



పెదవేగిలో నిరసన తెలుపుతున్న బాధితులు

దెందులూరు: దివ్యాంగుడు, వితంతువు, ఒంటరి మహిళ అని కూడా చూడలేదు. గత నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను నిలిపివేశారు. అలాగే ఈనెల కూడా పెన్షన్ ఇవ్వలేదు. దీంతో బాధితులు పెదవేగి ఎంపీడీఓ కార్యాలయం వద్ద నేలపై కూర్చొని నిరసన తెలిపారు. పెదవేగి గ్రామానికి చెందిన దివ్యాంగుడు తాతా మాణిక్యాలరావు, వితంతువు తాతా రమాదేవి, ఒంటరి మహిళ ఎం.రత్నకుమారిలకు గత నెలలో అధికారులు పెన్షన్ నిలుపుదల చేశారు. ఎంతమందికి చెప్పినా.. ఎంతసేపు బతిమిలాడినా తమ ఆరోగ్య పరిస్థితిని సైతం పరిగణనలోకి తీసుకోకుండా పెన్షన్ నగదును ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఈనెల అయినా ఇస్తారని ఆశగా ఎదురుచూశామని, ఇవ్వలేదని కన్నీటి పర్యంతమయ్యారు.

లబ్ధిదారులు విల'పింఛెన్'

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని కొత్త పూసలమర్రు గ్రామంలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు ఇవ్వకుండా గురువారం గ్రామంలోని సెంటర్‌లో సొమ్ములు అందించడంతో దివ్యాంగులు, వృద్ధులు అవస్థలు పడ్డారు. పలువురు లబ్ధిదారులు ఉదయం నుంచే పెన్షన్ డబ్బుల కోసం క్యూలైన్లలో వేచి ఉన్నారు. మరికొందరు తమ వంతు వచ్చేవరకూ సమీపంలోని చెట్లు, రేకుల షెడ్డు కింద పడిగాపులు పడ్డారు. గత జగన్ ప్రభుత్వంలో కోడి కూయకముందే ఇంటి వద్దకే తలుపుతట్టి పింఛన్ సొమ్ములు అందించేవారని లబ్ధిదారులు గుర్తుచేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వలంటీర్లను పక్కనపెట్టి సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీ చేయాలని ఆదేశించింది. అయితే కొందరు సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారులను తమ వద్దకే రప్పించుకుని పింఛన్ సొమ్ములు అందించడంపై వృద్ధులు, దివ్యాంగులు మండిపడ్డారు. వృద్ధాప్యంలో ఆరోగ్యం బాగోలేకపోయినా పింఛన్ సొమ్ముల కోసం అవస్థలు పడాల్సి వస్తుందని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు.



కొత్తపూసలమర్రులో ఓ సెంటర్‌లో కూర్చుని పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఉద్యోగులు

సోలార్‌తో శోబిల్లు


ఉమ్మడి జిల్లాలో 469 దరఖాస్తులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సూర్యఘర్ పథకం కోసం 469 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. సుమారు 1,524 కిలోవాట్స్ విద్యుత్ ఉత్పత్తి జరిగేలా ఆయా దరఖాస్తుదారుల కిలో వాట్స్ వినియోగం ఉంటుంది. ఇప్పటివరకు పథకంలో భాగంగా 93 సోలార్ రూఫ్‌టాప్‌లను ఆయా గృహాలు, అపార్టుమెంట్ల వద్ద ఏర్పాటుచేశారు. మరో 318 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోగా.. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంది.



ఇంటింటా నిరంతరాయంగా విద్యుత్ కాంతులు వెదజల్లడంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను అమలు చేస్తోంది. భవనం పైభాగంలో సోలార్ రూఫ్ టాప్ (ప్యానల్స్)ను ఏర్పాటుచేసుకుని సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి వినియోగించుకోవడంతో పాటు అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు తరలించి విక్రయించుకోవచ్చు. నిరంతర విద్యుత్‌తో పాటు విద్యుత్ అంతరాయాలు, లోఓల్టేజీ, విద్యుత్ బిల్లుల సమస్యలకు చెక్ పెట్టేలా ఈ పథకాన్ని రూపొందించారు. పెట్టుబడి సులభంగా తిరిగి రావడంతో పాటు రూఫ్‌టాప్ ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ కూడా అందించడంతో ఈ పథకానికి స్పందన బాగుంది.

ఇంటింటా సౌర కాంతులు
- పీఎం సూర్యఘర్‌తో నిరంతర వెలుగులు
- పవర్ కట్, లో ఓల్టేజీలకు చెక్
- సోలార్ ప్యానల్స్‌తో విద్యుత్ ఉత్పత్తి
- ఉమ్మడి జిల్లాలో 469 దరఖాస్తులు
- 93 భవనాలకు రూఫ్ టాప్‌ల ఏర్పాటు



ఆకివీడు : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పలువురు విద్యుత్ వినియోగదారులు సూర్యఘర్ పథకంపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, పాఠశాలలు, రైల్వేస్టేషన్లు, రైల్వే గేట్లు, డివైడర్లు, అపార్టుమెంట్ల వద్ద సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసి విద్యుత్‌ను ఉత్పత్తి చేసి వినియోగిస్తున్నారు. సూర్యఘర్ పథకం ద్వారా దేశవ్యాప్తంగా కోటి కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రాయితీలు అందించి ప్రోత్సహిస్తోంది. కేవలం గృహ లబ్ధిదారులకు మాత్రమే రాయితీలు వర్తిస్తాయి.

ప్యానల్స్.. నెట్ మీటర్ ఏర్పాటు

విద్యుత్ అధికారుల ఆమోదంతో ఆయా గృహాలపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటుచేస్తారు. భవనంపై భాగంలో వంద చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ అమరుస్తారు. ప్రస్తుతం వాడే విద్యుత్ మీటర్ స్థానంలో నెట్ మీటర్ ఏర్పాటు చేసి, దీని ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి, వినియోగం లెక్కిస్తారు. అలాగే అదనపు విద్యుత్‌ను ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తారు.

సులభంగా పెట్టుబడి వెనక్కి..

సబ్సిడీ, బ్యాంకు రుణంతో పాటు పెట్టుబడి ఆరేడేళ్లలో తిరిగి వస్తుంది. సూర్యఘర్ ప్యానల్స్ ఏర్పాటు చేసిన 30 రోజుల్లో వినియోగదారుల ఖాతాల్లో సబ్సిడీ జమ చేస్తారు. ముందుగా వినియోగదారులు తమ బ్యాంక్ ఖాతా వివరాల్ని అప్‌లోడ్ చేయాలి. 100 చదరపు అడుగుల్లో ఏర్పాటుచేసిన కిలోవాట్ రూఫ్ టాప్ కెపాసిటీ విద్యుత్ ఉత్పత్తికి 3–4 ప్యానల్స్ వినియోగిస్తారు.

పథకాన్ని పొందండిలా..

- పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పొందేందుకు గృహ విద్యుత్ వాడకం 300 యూనిట్లలోపు ఉండాలి.
- పథకం కోసం మొబైల్‌లో సూర్యఘర్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులో వినియోగదారుడి వివరాలు నమోదు చేయాలి.
- ఆరు నెలల విద్యుత్ బిల్లుల కాపీలను జతచేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.
- రిజిస్ట్రేషన్ ఫీజు కిలో వాట్స్‌ను బట్టి చెల్లించాలి.
- 5 వాట్స్‌కు రూ.1,900, 5 వాట్స్ పైబడితే రూ.5,900లు చెల్లించాలి. 10 కిలో వాట్స్ పైబడిన హెచ్‌టీ సర్వీసుదారులు రూ.11,800లు చెల్లించాలి.
- 3 కిలో వాట్స్‌లోపు సర్వీసులకు ఫీజు లేదు. అనంతరం ట్రాన్స్‌కో అనుమతులు పొందిన తర్వాత వెండర్లను ఎంపిక చేసుకోవాలి.
- కిలో వాట్స్‌ను బట్టి సబ్సిడీ మంజూరు చేస్తారు.
- మిగిలిన సొమ్ము మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తారు. వినియోగదారులు వాయిదాల పద్ధతిలో రుణం చెల్లించాల్సి ఉంటుంది.



సోలార్ విద్యుత్ ప్యానల్స్

సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు సామర్థ్యం (లోడ్)	ఉత్పత్తి అయ్యే యూనిట్లు (నెలకు)	ఏడాదికి ఆదా (సుమారు)	ప్రభుత్వ రాయితీ (సుమారు)
1 కిలోవాట్	120	రూ.8,000	రూ.30,000
2 కిలోవాట్	240	రూ.20,000	రూ.60,000
3 కిలోవాట్	360	రూ.32,400	రూ.78,000


స్పందన బాగుంది



ఉమ్మడి జిల్లాలో సూర్యఘర్ పథకం కోసం దరఖాస్తులు బాగా వస్తున్నాయి. మంచి స్పందన ఉంది. పథకం ద్వారా సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకున్న వినియోగదారులు నిరంతరం విద్యుత్ పొందవచ్చు. పెట్టిన పెట్టుబడి త్వరగానే తిరిగి వస్తుంది. అదనపు విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. రూఫ్‌టాప్ కోసం, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నం.1912 కాల్ చేయవచ్చు.

– పి.సాల్మన్‌రాజు, ఎస్ఈ, ట్రాన్స్‌కో, ఏలూరు

మా పాఠశాలకు వరం



మా స్కూల్‌లో సోలార్ ప్యానల్స్ 10 కేవీ కెపాసిటీవి రెండు ఉన్నాయి. వాటి ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. అలాగే రెండు మీటర్లు కూడా ఉన్నాయి. స్కూల్‌లో 8 ఏసీలు వాడుతున్నాం. సోలార్ ప్యానల్స్ ద్వారా నెలకు 900 నుంచి 1,500 వరకు యూనిట్లు ఉత్పత్తి అవుతున్నాయి. అదనపు విద్యుత్ గ్రిడ్‌కు సరఫరా చేస్తున్నాం. సోలార్ విద్యుత్ మా పాఠశాలకు వరంలా మారింది.

– బందెల శ్రీకాళహస్తీశ్వరుడు, హెచ్‌ఎం, పెదకాపవరం హైస్కూల్, ఆకివీడు మండలం

క్లుప్తంగా

కృష్ణా డెల్టా సమస్యను పరిష్కరిస్తాం



రైతులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

పెదపాడు: ఖరీఫ్‌కు సంబంధించి రైతులకు సాగునీటి సమస్య పరిష్కరిస్తామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. మండలంలోని సత్యవోలులో క్యాంపు కార్యాలయం వద్ద కృష్ణా డెల్టా ఆయకట్టు రైతులు తమ సమస్యలు ఆమెకు వివరించారు. శివారు ప్రాంతం కావడంతోను పూర్తిస్థాయిలో కేఈ కెనాల్‌కు నీటి ప్రవాహం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఓటర్ల జాబితాల ప్రదర్శన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సమగ్రశిక్ష పథక సంచాలకుల ఆదేశాల మేరకు ఈ నెల 8న నిర్వహించనున్న పాఠశాలల నిర్వహణ కమిటీల ఎన్నికలను పురస్కరించుకుని షెడ్యూల్‌లో భాగంగా గురువారం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ప్రాథమిక ఓటర్ల జాబితాలను ప్రదర్శించినట్లు డీఈఓ ఎస్.అబ్రహం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 1845 ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ యాజమాన్యాల పాఠశాలల్లో ఈ జాబితాలను ప్రదర్శించారన్నారు. జాబితాలను ఈ నెల 5వ తేదీ వరకూ పాఠశాలల్లో ప్రదర్శనలో ఉంచుతారని, ఈ జాబితాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తీసుకుని తుది ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారన్నారు. తుది ఓటర్ల జాబితాల ఆధారంగా ఈ నెల 8న ఎంఈఓలు 1, 2, ఎంపీడీఓ, ఎంఆర్ఓ, వీఆర్వో, వీఆర్ఏల పర్యవేక్షణలో పాఠశాలల నిర్వహణ కమిటీ సభ్యుల ఎన్నిక, చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికలను పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికలను పర్యవేక్షించడానికి సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులను కొన్ని మండలాలకు ఒకరిని ఇన్‌చార్జ్‌లుగా నియమించినట్లు తెలిపారు.

ఏపీ నిట్‌లో 16న ఇండక్షన్

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి ఇండక్షన్ కార్యక్రమం ఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు నిట్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్ కోర్సులో చేరేవారు ఒరిజినల్ డాక్యుమెంట్ల పరిశీలన కార్యక్రమం కోసం జోసా ఐదు రౌండ్లు, సీశాబ్ ప్రత్యేక రౌండ్లలో ఏపీ నిట్‌లో సీటు పొందిన విద్యార్థులు ఆగస్టు పదో తేదీ నుంచి 14 వరకు వ్యక్తిగతంగా హాజరుకావాలని సూచించారు. వీరికి ఇండక్షన్ కార్యక్రమం 16న ఉంటుందని తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

భీమవరం: పట్టణంలోని బైపాస్ రోడ్డులో ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని పుంత రోడ్డులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ ఎం.వెంకటేశ్వరరావు గురువారం చెప్పారు. మృతుడి వయస్సు 65 ఏళ్లు ఉంటుందని, ప్రమాదవశాత్తు జారిపడిపోవడం వల్ల తలకు గాయమై మృతి చెంది ఉండవచ్చన్నారు. వీఆర్వో శ్యామలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పింఛను కోసం పరేషాన్

మొన్నటి వరకు కడుపులో నీరు కదలకుండా తెల్లవారక ముందే వలంటీర్ ఇంటికే వచ్చి నవ్వుతూ పింఛన్ అందించేవారు. కానీ రోజులు మారాయి.. ఆధార్ కార్డు పట్టుకుని పింఛన్ ఎక్కడ ఇస్తారా అని వెతుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇంకొందరైతే సచివాలయంలో పింఛన్ల కోసం పడిగాపులు కాస్తున్న పరిస్థితి. తెల్లవారకముందే సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛన్ అందించాలని ప్రభుత్వం ప్రకటనలు ఇస్తున్నా.. కొంతమంది సిబ్బంది వృద్ధులు, వికలాంగులను సచివాలయానికి పిలిపించుకుని పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. దీంతో 'ఎంతటి కష్టాన్ని కొనితెచ్చుకున్నాంరా నాయనా' అంటూ వృద్ధులు బాధపడుతున్నారు. ఏలూరు నగరంలో గురువారం పలు డివిజన్లలో కనిపించిన పింఛన్ అవస్థల్లో కొన్ని ఇవి. – ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



చోడిదిబ్బ సచివాలయానికి లబ్ధిదారులను పిలిపించుకుని పింఛన్ ఇస్తున్న సిబ్బంది



పింఛన్ కోసం గుమ్మంలో ఎదురుచూస్తున్న దివ్యాంగుడు



సచివాలయంలో పింఛన్ తీసుకుని వస్తున్న వృద్ధురాలు



ఒకేచోట కూర్చొని పింఛన్ ఇస్తున్న సచివాలయ సిబ్బంది

ముగ్గురు బైక్ దొంగల అరెస్టు

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ సర్కిల్ పరిధిలో మోటారు సైకిళ్లను చోరీ చేస్తున్న ముగ్గురు నిందితులను ఏలూరు వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఏలూరు వన్‌టౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 2024 జూన్, జూలై నెలలో రాత్రి వేళల్లో తాళాలు వేసి ఉన్న వాహనాలను దొంగలు అపహరిస్తున్నారు. మోటారు సైకిళ్ల చోరీలపై వాహనదారుల ఫిర్యాదుల మేరకు ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు పోలీస్ సబ్‌డివిజన్ అధికారి, అదనపు ఎస్పీ ఈ.శ్రీనివాసులు పర్యవేక్షణలో ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని నియమించారు. వన్‌టౌన్ ఎస్‌ఐ ఎన్.లక్ష్మణబాబు తన బృందంతో చోరీ గ్యాంగ్ కోసం దర్యాప్తు చేపట్టారు. గురువారం ఏలూరు వన్‌టౌన్ గాంధీమైదానం ప్రభుత్వ మద్యం దుకాణం సమీపంలో స్కూటీపై అనుమానాస్పదంగా ముగ్గురు వ్యక్తులు సంచరిస్తుండగా వారిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేశారు. ఈ విచారణలో ఏలూరు వన్‌టౌన్, రూరల్, ద్వారకాతిరుమల, ఒంగోలు, కందుకూరు, సింగరాయకొండ ప్రాంతాల్లో మోటారు సైకిళ్ళు చోరీలు చేసినట్లు తేలింది. ఏలూరు నగరంలోనూ, ఇతర ప్రాంతాల్లోనూ చోరీలకు పాల్పడుతున్న ఏలూరు కుమ్మరిరేవు 2వ వీధికి చెందిన కర్రి సత్యనారాయణ, మోతేవారితోట సచివాలయం ఎదురు ప్రాంతానికి చెందిన చిలకల నిఖిల్‌సాయి, తాపీమేస్త్రీ కాలనీ 9వ రోడ్డుకు చెందిన ఉప్పాడ కార్తీక్ సాయిను అరెస్టు చేశారు. నిందితుల నుంచి 6 మోటారు సైకిళ్ళను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో వన్‌టౌన్ హెచ్‌సీ ఏ.అప్పన్న, కానిస్టేబుల్స్ కే.శ్రీనివాస్, ఆర్.మోహన్‌కృష్ణ ఉన్నారు. వీరినీ జిల్లా ఎస్పీ ప్రతాప శివకిషోర్ అభినందించారు.



నిందితులు, స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

కువైట్‌లో కష్టాలు పడుతున్నా కాపాడండి

- సోషల్ మీడియాలో గిరిజన మహిళ వీడియో వైరల్
- ఇండియాకు తీసుకువచ్చి కాపాడాలంటూ వేడుకోలు

బుట్టాయగూడెం: 'పొట్టకూటి కోసం కువైట్ దేశం వచ్చి ఇక్కడ అనేక కష్టాలు పడుతున్నానని, తనను తిరిగి ఇండియా తీసుకువచ్చేలా కాపాడాలి' అంటూ ఓ గిరిజన మహిళ సెల్ఫీ వీడియోలో ప్రభుత్వాన్ని వేడుకుంది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాలిలా ఉన్నాయి. మర్లగూడెంకు చెందిన తాటి సంకురమ్మ ఏడాది క్రితం ఉపాధి కోసం కువైట్ వెళ్లింది. అక్కడ ఒక ఇంట్లో పనిచేస్తున్నానని, ఆ ఇంట్లో 10 మంది వరకు కుటుంబ సభ్యులు ఉన్నారని, 3 అంతస్తుల భవనంలో ప్రతి రోజూ ఎక్కి దిగి పనులు చెయ్యడం, వారందరికీ తాను ఒక్కటే వంట చేస్తున్నట్లు చెప్పింది. ఉదయం నుంచి రాత్రి 2 గంటల వరకు కూడా కష్టపడి పనిచేస్తున్నానని అనారోగ్యం చేస్తే కనీసం పట్టించుకునే నాథుడు లేడని కన్నీటి పర్యంతమైంది. ఇటీవల తనను కొట్టి గదిలో బంధించి సెల్‌ఫోన్‌ను కూడా తీసేసుకున్నారని, తాను ఇక్కడే ఉండి పనిచేస్తానని చెప్పగా ఫోన్ తిరిగిచ్చారని, తనను కాపాడాలని కోరుతూసెల్ఫీ వీడియో గురువారం అప్‌లోడ్ చేసింది. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరింది.



సెల్ఫీ వీడియోలో సంకురమ్మ

బడ్జెట్ పెట్టలేకపోవడం చంద్రబాబు వైఫల్యమే

వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభంపాటి విజయరాజు విమర్శ

లింగపాలెం: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50 రోజులైనా ఇప్పటివరకు బడ్జెట్‌ప్రవేశ పెట్టకుండా ఓట్ ఆన్ అకౌంట్‌పై నడిపించడంపై వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు ధ్వజమెత్తారు. భోగోలులో పార్టీ నాయకుడు ఇనుగంటి సతీష్ ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయరాజు మాట్లాడారు. సీనియర్ నాయకుడినని చెప్పుకుంటున్న కూటమి సీఎం చంద్రబాబు బడ్జెట్ ప్రవేశపెట్టక పోవడం ఆయన అసమర్థతకు నిదర్శనమన్నారు. 2019 మే 30న వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చేసరికి రాష్ట్ర ఖజానాలో 100 కోట్లు మాత్రమే ఉన్నా ఆనాడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. టీడీపీ కూటమి కుట్ర పూరిత హామీల గురించి ప్రజలకు తెలుస్తుందనే భయంతోనే చంద్రబాబు బడ్జెట్ ప్రవేశపెట్టడం లేదని విమర్శించారు. చంద్రబాబు ఎన్నికల్లో హామీలిచ్చిన పథకాలు అమలు చేయకుండా లోకేష్ ఎలక్షన్ ముందు చెప్పిన విధంగా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ అటకెక్కించారని, ఒక్క పథకం కూడా ఇచ్చే పరిస్థితి కనపడటం లేదని విజయరాజు ఎద్దేవా చేశారు. ముఖ్యంగా తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి ఒక్కొక్కరికి రూ.15వేలు ఇస్తామన్నారని, కానీ నేటికీ అమలు చేయడంలేదన్నారు. అదే వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండి ఉంటే జూన్‌లోనే అమ్మఒడి, రైతు భరోసా పథకాలను అమలు చేసేదని ప్రజలు ఆవేదనగా చెప్పుకుంటున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ ద్వారా రూ.800 కోట్లకు పైగా ఆదా చేసి 80 శాతం పనులు పూర్తి చేస్తే కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్ట్ పనులు కాలేదని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. చింతలపూడి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి చెందిన సర్పంచ్, జెడ్పీటీసీలు, ఎంపీపీలకు తెలియకుండా ప్రోటోకాల్ అమలు చేయకుండా ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇసుక, మట్టి ఎటువంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా తోలకాలు చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన నెలలోపే 40 లక్షల టన్నుల ఇసుక మాయం చేశారని విమర్శించారు. దోపిడీలు, హత్యాయత్నాలు, అఘాయిత్యాలు, వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు తప్ప చంద్రబాబు ప్రభుత్వం చేసిందేమి లేదని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కొఠారి మోహన్, నాయకులు పెద్దిన శ్రీను, పి.వేమనరెడ్డి, ఈ.సతీష్ పాల్గొన్నారు.



భోగోలులో విలేకరులతో మాట్లాడుతున్న విజయరాజు

కొత్త సిలబస్‌లో పాఠ్యాంశాలు తగ్గించండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా కామన్ ఎగ్జామ్స్ బోర్డు ఆధ్వర్యంలో ప్రస్తుత 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మారిన 10వ తరగతి పాఠ్యపుస్తకాలు, ప్రశ్నాపత్రం అనే అంశంపై ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఈదర సుబ్బమ్మ దేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ కార్యదర్శి ఎ.సర్వేశ్వరరావు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో 9, 10 తరగతుల పాఠ్యపుస్తకాల్లో చేసిన మార్పులను వాటికి సంబంధించి ప్రశ్నాపత్రాల రూపకల్పనకు సంబంధించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠ్యపుస్తకాల్లో దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్షల ప్రాధాన్యతను ప్రత్యేక అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు వివరించారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన సిలబస్‌లో ప్రతి పాఠ్యాంశం 15 నుంచి 18 పేజీలలో ఇవ్వడం వల్ల ఒక్కొక్క పాఠ్యాంశం బోధించడానికి సమయం సరిపోదన్నారు. గతంలో సాంఘికశాస్త్రం పుస్తకం ఒక్కటే ఉండేదని, అందులోనే భూగోళ శాస్త్రం, చరిత్ర, అర్థశాస్త్రం వంటి సబ్జెక్టులను పొందుపరిచారని, ప్రస్తుతం సాంఘిక శాస్త్రం పుస్తకాన్ని నాలుగు భాగాలుగా విడదీసి నాలుగు పాఠ్యపుస్తకాలు ఇవ్వడం వల్ల విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. ఈ మేరకు పాఠ్యాంశాలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు స్పందిస్తూ ఉపాధ్యాయుల సూచనలను ఎస్‌సీఈఆర్టీకి ప్రతిపాదిస్తామని స్పష్టం చేశారు. హిందీ సబ్జెక్టు శిక్షణకు 200 మంది హిందీ పండిట్లు, సోషల్ సబ్జెక్టు శిక్షణకు 245 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. కైకలూరు ఎంఈఓ వి.శ్రీనివాస్, సుబ్బమ్మదేవి స్కూల్ హెచ్‌ఎం కుటుంబ రావు, జిల్లా రీసోర్స్ పర్సన్లు నారాయణం శివశంకర్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER

■ మీరు బైబ్యాక్ అగ్రిమెంట్‌తో లాభదాయకమైన లేడీస్ శానిటరీ ప్యాడ్స్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ వ్యాపారాన్ని ప్రారంభించండి. (ప్రభుత్వ ఆమోదితము) 8376001873, 9643010487, 83760 89771, 011-25920179 [DA-5872]

Wanted

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000,ఫ్రీ రూం+భోజనం.HYD.Ph: 6309020999 [HA-432]

■ రాజు న్యూరో అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు పనిచేయుటకు ఫార్మసిస్ట్ మరియు రిసెప్షనిస్టు కావలెను. సంప్రదించండి. ✆ : 98853 96111 [R-6937]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీ: 18K. ఫోన్ 9640258899, 9640468899 [H-796263]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 8121818692 [M-1185372]

■ Job Vacancy : YIP PVT LTD. Age : 18 to 45 Yrs. Qual. : 10th to Any Degree, Salary : 18000/- to 25000/- (Work From Home Available). ✆ 89789 45341. [M-1185373]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

డీటీకి షోకాజ్ నోటీసు జారీ

వరద బాధితుల సరుకులు దారిమళ్లింపు వ్యవహారం

వేలేరుపాడు: వరద బాధితుల సరుకులను దారి మళ్లించిన వ్యవహారంలో సివిల్ సప్లయిస్ డీటీ సురేంద్ర పాత్ర ఉందని విచారణలో వెలుగు చూడటంతో అతనికి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. వేలేరుపాడు గిరిజన ఆశ్రమ పాఠశాల స్టాక్‌పాయింట్ నుంచి ఓ వ్యాన్‌లో 40 క్వింటాళ్ల ఉల్లిపాయలు, 31 క్వింటాళ్ల బంగాళదుంపలు వరద బాధితులకు పంపిణీ చేసేందుకు తరలిస్తుండగా, వ్యాన్‌ను బుధవారం దారి మళ్లడాన్ని గుర్తించి దీనిని జనసేన మండల అధ్యక్షులు గణేశుల ఆదినారాయణ పట్టుకుని వేలేరుపాడు తహసీల్దార్‌కు అప్పగించిన విషయం తెల్సిందే. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ రమేష్ గురువారం వ్యాన్ డ్రైవర్, గ్రామస్తుల నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. దీనికి సివిల్ సప్లయిస్ డీటీ సురేంద్ర బాధ్యులుగా గుర్తిస్తూ జంగారెడ్డిగూడెం ఆర్డీఓకు గురువారం నివేదిక అందజేశారు. అంతేకాకుండా జిల్లా పౌరసరఫరాల అధికారి సదరు డీటీ సురేంద్రకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

గొల్లగూడెంలో విద్యార్థినిపై ఈవ్‌టీజింగ్

- నిందితుడు టీడీపీ నేత కుమారుడు
- కేసు నమోదు చేయని పోలీసులు

ఉంగుటూరు: గొల్లగూడెం హైస్కూలులో ఓ విద్యార్థినిపై గోపినాథపట్నం కాలనీకి చెందిన ఉప్పాటి రామకృష్ణ అనే యువకుడు వెంటపడి ఈవ్‌టీజింగ్‌కు పాల్పడ్డాడు. బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి విద్యార్థిని చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో అదేరోజు ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు దీనిపై కేసు నమోదు చేయకపోవడం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. సమీప గ్రామం నుంచి విద్యార్థిని ప్రతిరోజూ గొల్లగూడెం జెడ్పీ హైస్కూలుకు సైకిల్‌పై వచ్చి వెళుతోంది. బుధవారం సాయంత్రం స్కూలు అయిపోయిన తరువాత తోటి విద్యార్థినులతో కలిసి ఇంటికి వెళుతుండగా, గొల్లగూడెం నుంచే వెంటపడిన యువకుడు ఉప్పాటి రామకృష్ణ నల్లమాడు బ్రాందిషాపు దాటిన తరువాత విద్యార్థినిని ఆపి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో విద్యార్థిని రోదిస్తూ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు చెప్పగా, వారు సర్పంచ్ తమ్మిన శ్రీనివాసరావుతో కలిసి చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే యువకుడు టీడీపీకి చెందిన ఓ నేత కుమారుడని తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేయడానికి వెనుకంజ వేసినట్లు సమాచారం. దీనిపై ఎస్సై మణికుమార్‌ను వివరణ కోరగా విద్యార్థిని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని, దీనిపై విచారణ చేసి కేసు నమోదు చేస్తామని ఎస్సై చెప్పారు.

వర్గీకరణ ఫలాలు ఎస్సీ ఉపకులాలకు చేరాలి

పాలకొల్లు అర్బన్: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రిజర్వేషన్ ఫలాలు ఎస్సీ ఉప కులాలకు చేరేలా ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జి ఖండవల్లి వాసు డిమాండ్ చేశారు. పాలకొల్లు గాంధీబొమ్మల సెంటర్‌లో గురువారం సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసు మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో ఎమ్మార్పీఎస్ ఉపకులాల వారు గత 30 ఏళ్లుగా చేస్తున్న పోరాటాలకు ఫలితం దక్కిందన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో మంద కృష్ణమాదిగ చేసిన పోరాటం ఎట్టకేలకు ఫలించిందన్నారు. వర్గీకరణ ఉద్యమంలో అమరులైన కార్యకర్తలకు జోహార్లు అర్పించారు. ఎమ్మార్పీఎస్ ఉపకులాల నాయకులు కాపవరపు జక్కరయ్య, మాదాసు జయరాజు, లంక చిరంజీవి, కొల్లి వెంకట్రావు, కనపాల మోహనరావు, కారుమంచి కిరణ్, దిగమర్తి నాగరాజు, దిగమర్తి రాజ్‌కుమార్, తెన్నేటి సామ్యూల్, పసల విశ్వనాథం, సనమండ నీవన్, కంకిపాటి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పాలకొల్లులో బాబూ జగ్జీవన్‌రామ్, పూలే విగ్రహాలకు పూలమాల వేస్తున్న ఎస్సీ నాయకులు

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై అప్పీల్‌కు వెళతాం


భీమవరం: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీల్‌కు వెళతామని పీవీ రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్‌రావు అన్నారు. పట్టణంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నమండ బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన పీవీరావు మాలమహానాడు అత్యవసర సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చెల్లదని, వర్గీకరణ చేయటానికి ఏ రాష్ట్ర ప్రభుత్వానికి అర్హత లేదని 2004 సంవత్సరంలో ఇదే ఐదుగురు సభ్యుల సుప్రీం ధర్మాసనం తీర్పునిచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసుకునే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వటం సరి కాదన్నారు. దీనిపై పీవీరావు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ మాట్లాడుతూ సుప్రీం తీర్పుపై న్యాయ నిపుణులతో చర్చించి దీనిపై అప్పీల్‌కు వెళతామని స్పష్టం చేశారు. దళిత నాయకుడు కోరం ముసలయ్య, జిల్లా అధ్యక్షుడు బండి శ్యామ్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి గోడి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడులో ఘరానా చోరీ

ఆకివీడు: ఆకివీడులో పట్టపగలు నడిరోడ్డు పక్కనే ఉన్న రెండు షాపుల్లోకి ఓ వ్యక్తి దర్జాగా వెళ్లి నగదును దోచుకెళ్లాడు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక స్టేట్ బ్యాంక్ పక్కనే ఉన్న షాపుల యజమానులు గురువారం మధ్యాహ్నం షాపు తలుపులకు తాళాలు వేసి షట్టర్ దించకుండా వెళ్లారు. ఓ వ్యక్తి స్కూటర్‌పై వచ్చి దర్జాగా తలుపు తాళం తీసుకుని లోపలికి వెళ్లి సొరుగు తాళం బద్దలు కొట్టి నిమిషాల వ్యవధిలో రెండు షాపుల్లో సుమారు రూ.40 వేల నగదు దోచుకుని ఉడాయించాడు. యజమానులు షాపుల వద్దకు వచ్చిచూసేసరికి తలుపులు తెరిచి ఉండడంతో కంగారుగా లోపలకు వెళ్లి చూడగా, చోరీ విషయాన్ని గుర్తించారు. పోలీసులు ఫిర్యాదు చేయడంతో ఎస్సై నాగబాబు ఘటనా స్థలానికి చేరుకుని సీసీ కెమెరాలు పరిశీలించారు. స్కూటర్‌పై వచ్చిన వ్యక్తి చోరీ చేశాడని, ఆ వ్యక్తి కైకలూరు వైపు వెళ్ళినట్లు గమనించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూమి కాజేత యత్నంపై కేసు నమోదు

నూజివీడు: '25ఎకరాల భూమి కాజేతకు యత్నం' శీర్షికతో గురువారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన నేపథ్యంలో తహసీల్దార్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి చెప్పారు.



నకిలీ సర్టిఫికెట్ ఇదే

సాక్షి ఎఫెక్ట్

భూమి కాజేత యత్నం వెనుక టీడీపీ నేతలు?

పట్టణంలో సంచలనంగా మారిన భూమి కాజేత వ్యవహారం వెనుక ఎవరున్నారనే దానిపై పట్టణ ప్రజల్లోనూ, రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర చర్చ నడుస్తోంది. భూమిని కాజేయాలని చూసిన భూబకాసురులు టీడీపీ నేతలనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. నకిలీ సర్టిఫికెట్‌ను ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడుకు చెందిన నాగం కాటరాజు అనే వ్యక్తికి చెందినదిగా, పొజిషన్‌లో ఉన్నట్లుగా రూపొందించారు. ఈ పత్రాలపై గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసి డిప్యూటీ కలెక్టర్‌గా ప్రమోషన్‌పై బదిలీ అయిన డీవీఎస్ యల్లారావు హయాంలో ఇచ్చినట్లుగా ఆయన సంతకాన్ని ఫోర్జరీ చేశారని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. అయితే దీని వెనుక పెద్ద వాళ్లే ఉన్నారని, సాధారణ స్థాయి నేతలు ఇంత పెద్ద మొత్తంలో భూమిని కాజేసే సత్తా గాని, సామర్థ్యం కాని వారికి లేదని చెబుతున్నారు. ఈ వ్యవహారం ఆర్డీఓ దృష్టికి జూలై 15నే రాగా, దీనిపై విచారణ చేసి రిపోర్ట్‌ను ఇవ్వాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. అయితే ఈ విచారణ ఏమైందనేది ఇంతవరకు వెలుగులోకి రాకపోవడం గమనార్హం.

క్లుప్తంగా

పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలి



గురుకుల పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌ఛార్జ్ మలేరియా అధికారి

తాడేపల్లిగూడెం రూరల్: వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవడానికి పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జ్ మలేరియా అధికారి డాక్టర్ కోసూరి రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ రవి కుమార్ మాట్లాడారు. అనంతరం గురుకుల విద్యార్థుల ఆరోగ్య పరీక్షల తీరును పరిశీలించారు. మలేరియా తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు, పెదతాడేపల్లి ఉప కేంద్ర సిబ్బంది ప్రవల్లిక, ఎంఎల్‌హెచ్‌పీ, ఆరోగ్య కార్యకర్త పద్మ, ఆరోగ్య సహాయకులు కాంతారావు పాల్గొన్నారు.

స్వల్పకాలిక వరి వంగడాలను వేసుకోవాలి



నవాబుపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు వివరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఎర్ర కాలువ ముంపునకు గురైన మండలంలోని నవాబుపాలెం, జగన్నాథపురం గ్రామాల్లో గురువారం జిల్లా ప్రకృతి వ్యవసాయం డిప్యూటీ మేనేజర్ అరుణకుమారి వరి చేలను పర్యటించారు. ఈ సందర్భంగా రైతులకు అనుకూలమైన కూచి పటాలయ అనే దేశీయ విత్తనం గురించి ఆమె వివరించారు. దీని పంట కాలం 125 రోజులు అని, 20 నుంచి 25 బస్తాల దిగుబడి వస్తుందన్నారు. ఈ బియ్యానికి మార్కెట్‌లో కిలో 100 నుంచి 120 రూపాయలు లభిస్తాయన్నారు. కూచి పటాలయ వరి వంగడం సాగు చేసే విధానాన్ని ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ వై.నూకరాజు వివరించారు. వారి వెంట ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌ఛార్జ్ వీర్రాజు, రైతులు ఉన్నారు.

జాబ్ మేళాలో 32 మంది ఎంపిక



జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకులోని ఎస్సీబీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 32 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్ కుమార్ తెలిపారు. గురువారం కళాశాలలో ఫ్యూజన్ ఫైనాన్స్, ఎవన్ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీలు నిర్వహించిన జాబ్ మేళాలో వాటికి అవసరమైన 32 మందికి ఎంపికై నట్లు తెలిపారు.జాబ్‌మేళాలో ఎంపికై న విద్యార్థులను ప్రిన్సిపాల్, జేకేసీ కోఆర్డినేటర్ టీ సంధ్యారాణిలు అభినందించారు.


కళాకారుల సమస్యలు పరిష్కరించాలి



కందుల దుర్గేష్‌ను సత్కరిస్తున్న బీవీఆర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): కళాకారుల, కళా సంస్థల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వపరంగా కృషి చేయాలని ఏపీ సాంస్కృతిక నాటక పరిషత్ సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు ఏపీ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్ కలిసి కోరారు. పట్టణంలో వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేషను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో రాజమండ్రి లేదా అమరావతిలో సమాఖ్య ప్రతినిధులతో, కళా సంస్థలతో, కళాకారులతో సమావేశ తేదీని నిర్ణయించి తెలియజేస్తానని వివరించారు. యర్రా ఆంజనేయ స్వామి, తదితరులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ తీర్పుపై హర్షం



తెన్నేటి జగ్జీవన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు భావిత రాలకు బంగారు బాటలు వేస్తుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు తెన్నేటి జగ్జీవన్ పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం విద్యార్థుల తరగతి నియామకాలు, ఉద్యోగ నోటిఫికేషన్లు సైతం ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా చేపట్టాలని కోరారు.

తణుకులో హడలెత్తిస్తున్న దోమ

- విజృంభిస్తున్న విషజ్వరాలు
- రూ. కోట్లు కుమ్మరిస్తున్నా నియంత్రణ కరవే
- నామమాత్రంగా పారిశుద్ధ్య చర్యలు



లార్వా పుట్టుకకు కారణమవుతున్న తణుకులోని ఖాళీ స్థలాలు

తణుకు: దోమ...దోమ... దోమ.. ప్రస్తుతం ఎవరినోట విన్నా ఈ దోమల గురించే చర్చ. డెంగీ, మలేరియా జ్వరాలకు ఇవే ప్రధాన కారణమవుతున్నాయి. వీటి నివారణ కోసం ప్రభుత్వం రూ. కోట్లు వెచ్చిస్తోంది. వీటి బారిన పడి ఆస్పత్రుల్లో జనం రూ. లక్షల్లో ఖర్చు పెడుతున్నారు. చూసేందుకు ఇది చాలా చిన్నజీవి అయినప్పటికీ మనిషి శరీరంపై ఇది చూపే ప్రభావం అంతా ఇంతాకాదు. అదమరిస్తే కొన్ని సార్లు ప్రాణాలను తీసేస్తుంది. ప్రస్తుతం తణుకు పట్టణాన్ని హడలెత్తిస్తున్న జీవి దోమ. ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా, గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులకు దోమలే కారణం. పరసరాల శుభ్రత పాటించకపోవడం, చెత్తాచెదారం, బహిరంగ డ్రెయినేజీ వ్యవస్థ, నిల్వ ఉన్న నీరు, ఖాళీ స్థలాలు ఇందుకు కారణం. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రస్తుతం పారిశుద్ధ్యం అటకెక్కింది. పట్టణంతోపాటు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ట్యాంకుల శుభ్రం, క్లోరినేషన్ కార్యక్రమాలను చేపడుతోంది. అయితే ఇవి గ్రామీణ ప్రాంతాల్లో నామమాత్రంగానే సాగుతున్నాయి. ఇక పట్టణాల్లో అయితే సక్రమంగా ఫాగింగ్ చేయడం లేదు.

వ్యాధులకు కారణాలు...

డెంగీకి కారణమయ్యే ఈడిస్ ఈజిప్టే దోమ (టైగర్) ప్రస్తుతం ఎక్కువగా ఉంది. నల్లగా ఉండే ఈ దోమ ఒంటిమీద తెల్లని చారలు ఉంటాయి. పగటిపూట మాత్రం కుట్టే ఇది మూతలేని నీటి ట్యాంకులు, పాత టైర్లలో నిల్వ ఉన్న నీరు, తారు రోడ్లు, సిమెంటుమీద నిల్వ ఉండే వర్షపునీరు, ఇళ్లలోని పూల కుండీలు, కూలర్లు, వాడకుండా వది లేసిన పాత్రలు, కొబ్బరి చిప్పలు, చీకటిగా ఉండే మూలలు, కర్టెన్లు వంటి వేలాడే వస్తువులు, ఉపయోగించని గొడుగులు, అలంకరణ సామగ్రి కింద ఉంటాయి. కుట్టిన వారం తర్వాత హఠాత్తుగా తీవ్రమైన జ్వరం వస్తుంది. కాళ్ల కదిలించలేని పరిస్థితి ఉంటుంది. ఎముకల కండరాల్లో నొప్పి, శరీరంపై పొక్కులు, దద్దుర్లు వస్తాయి. ఇదే సీజన్లో సోకే మరో ప్రమాదకర జబ్బు మలేరియా. ప్లాస్మోడియమ్ పరాన్నజీవి ఆడ అనాఫిలస్ కల్సిఫేసిస్ దోమద్వారా ఇది వ్యాపిస్తుంది. మురుగునీటి కాలువలు, చెరువులు, కుంటలు, పంట కాలువలు, పొలాల్లో ఎక్కువగా ఇవి వృద్ధి చెందుతుంటాయి. ఇందులో ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం పాల్సిఫారమ్ అనేవి రెండు రకాలు, ప్లాస్మోడియం వైవాక్స్ అంత ప్రమాదకరమైంది కాదు. అయితే రెండో రకమే ఎక్కువగా కనిపిస్తోంది. వెంటనే చికిత్స చేయకుంటే కాలేయం, కిడ్నీలు, రక్తకణాలను దెబ్బతీస్తుంది. ఫైలేరియా క్యూలెక్స్ క్వింకే ఫేసియేటస్ దోమ ద్వారా బోధ కాలు (ఫైలేరియాసిస్) వస్తుంది. మురుగు, బురద నీరు గుంతలు, సెప్టిక్ ట్యాంకుల్లో ఇవి వృద్ధి చెందుతాయి. ప్రస్తుతం ఈ కేసులు కనిపిస్తున్నాయి. మెదడువ్యాపు వ్యాధి జపనీస్ ఎన్సెఫలైటీస్‌గా పిలుస్తారు. పందులను కుట్టిన దోమలు తిరిగి మనుషులను కుట్టడం ద్వారా ఇది వ్యాపిస్తుంది. ఇది పిల్లలకు ప్రాణాంతకంగా పరిణమించే అవకాశాలు ఎక్కువ.

దోమల నివారణకు నెల ఖర్చు రూ. 1.50 కోట్లు

దోమల నివారణ కోసం నిత్యం కాయిల్స్, రీఫిల్స్ కోసం నెలకు పెట్టే ఖర్చు రూ. కోట్లకు చేరుతోంది. నలుగురున్న ఓ ఇంట్లో నెలకు నాలుగు రీఫిల్స్, 30 దాకా కాయిల్స్ కొనాల్సిందే. నెలకు ఈ కుటుంబం ఇందు కోసం వెచ్చించే ఖర్చు రూ. 250. తణుకు పట్టణంలో 60 వేల కుటుంబాలున్నాయి. ఆ లెక్కన నెలకు దోమల నివారణకు అయ్యే ఖర్చు రూ. 1.50 కోట్లు. ఇది జనానికి భారమే.

మన చేతుల్లోనే మన ఆరోగ్యం

ఎవరో వచ్చి ఏదో చేస్తారని వేచి చూడకుండా మనం కొన్ని జాగ్రత్తలు పాటిస్తే జ్వరాల బారి నుంచి తప్పించుకోవచ్చు.

- వ్యాధులు రాకుండా ఎవరికివారు వ్యక్తిగత శుభ్రతను పాటించాలి. – బయటకు వెళ్లేటపుడు కాళ్లను, చేతులను కప్పి ఉంచే దుస్తులను వేసుకోవాలి.
- ఇంట్లో నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు మార్చుతుండాలి.
- వారానికోసారి డ్రైడేను పాటిస్తే దోమలార్వా చనిపోతుంది.
- నీటి సంపులు, ట్యాంకులపై తప్పకుండా మూతలు పెట్టుకోవాలి. – పాతటైర్లు, కప్పులు, పాత్రలు, కొబ్బరి చిప్పలు పరిసరాల్లో ఉండకుండా చూడాలి.
- ఇంటి కిటికీలు, తలుపులకు దోమలు రాకుండా వైర్ నెట్‌లను అమర్చుకోవాలి.
- పిల్లలకు దోమలు కుట్టకుండా పైపూత మందులు వాడుకోవచ్చు.
- జ్వరం రాగానే వెంటనే వైద్య పరీక్షలు చేసుకుని వ్యాధిని నిర్ధారించుకోవాలి
- డెంగీ ఆరంభ దశలో తెల్లరక్తకణాలు తగ్గుతాయి. తర్వాత ప్లేట్ లెట్స్ తగ్గుతాయి.
- మలేరియాలో చర్మంపై దద్దుర్లు చాలా అరుదుగా మాత్రమే కనిపిస్తాయి.
- ఉన్న చోట్ల అందరికీ ఒకేసారి యాంటీ ఫైలేరియా మందులను ఇవ్వడం ద్వారా వ్యాధి కారకాలు పూర్తిగా నశిస్తాయి.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు: తణుకు 11కేవీ ఫీడర్ల వార్షిక మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం పట్టణంలోని పలు ప్రాంతాలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ సీహెచ్ రామకృష్ణ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బ్యాంకు కాలనీ, బొమ్మల వీధి, సూర్యాలయం వీధి, సజ్జాపురం, యాపిల్ ఆసుపత్రి ఏరియా, పెరవలి రోడ్డు, బైపాస్ రోడ్డు, అజ్జరం కాలనీ, ఇందిరమ్మ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వన్ టౌన్ పరిధిలో కొండయ్యచెరువు సబ్ స్టేషన్ పరిధిలో కొండయ్య చెరువు, ఎల్‌ఐసీ, కడకట్ల ఫీడర్లుకు, పాతూరు సబ్ స్టేషన్ పరిధిలో మహాలక్ష్మినగర్ ఫీడర్‌కు, హౌసింగ్‌బోర్డు పరిధిలో రైల్వే ఫీడర్‌లకు మరమ్మతుల నిమిత్తం ఈ నెల 2వ తేదీ శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యు త్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరావు వెల్లడించారు. కొండయ్య చెరువు, కంటి రెడ్డి ఆసుపత్రి, రామారావు పేట, హెడ్ పోస్టాఫీస్ రోడ్డు, కన్నాల సత్రం వీధి, కడకట్ల గోగులమ్మ గుడి, సాహితీ ఆసుపత్రి, గొల్లగూడెం సెంటర్, తాడేపల్లి చెరువు, కింబర్లీ స్కూల్, మహాలక్ష్మినగర్, సత్యవతినగర్, టీటీడీ కల్యాణ మండపం, చెట్లు రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, జూబ్లీ రోడ్డు, సిపాయి పేట, వెంకటరత్నం ఆసుపత్రి ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

97.73 శాతం పింఛన్ల పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో వివిధరకాల పింఛన్లు 12,613 ఉండగా, గురువారం రాత్రి సుమారు 8 గంటల ప్రాంతానికి 12,327 పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో ఎస్.సుబ్రహ్మణ్యం తెలిపారు. తద్వారా 97.73 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. మిగిలిన పింఛన్లను శుక్రవారం పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి

సీపీఎం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

తణుకు: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి జరగాలంటే ప్రత్యేక హోదా కోసం పోరాటం చేయాల్సిందేనని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారాం అన్నారు. గురువారం స్థానిక లయన్స్ క్లబ్ ఆవరణలో సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్ష వర్గంగా జేఎస్‌వీ గోపాలన్, పీవీ ప్రతాప్, కేతా గోపాలన్, చింతకాయల బాబురావు, డి.కళ్యాణిలు వ్యవహరించారు. ఈ సందర్భంగా మంతెన సీతారాం మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని లేకపోతే సీపీఎం ఆందోళన సాగిస్తుందని అన్నారు. కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ప్రాధాన్యత రంగాలకు నిధులు తగ్గించడం, పేద ప్రజలపై భారాలు వేసేవిధంగా ఉన్నదని విమర్శించారు. బడ్జెట్‌లో మన రాష్ట్రానికి కేంద్రం నేరుగా నిధులు ఇవ్వాలని, అప్పులు ఇప్పించడం కాదన్నారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ వర్షాలు కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రోజు రోజుకీ పెరిగిపోతున్న కాలుష్యాన్ని అరికట్టే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, బి.వాసుదేవరావు, రాజా రామ్మోహన్‌రాయ్, జుత్తిగ నర్సింహమూర్తి, జవ్వాది శ్రీనివాస్, పి.పూర్ణ, అడ్డగర్ల అజయకుమారి పాల్గొన్నారు.

కొట్టును విమర్శించే అర్హత టీడీపీకి లేదు

ఏఎంసీ మాజీ ఛైర్మన్ ముప్పిడి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ ఛైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు

పెంటపాడు: మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను విమర్శించే స్థాయి టీడీపీ నాయకులకు లేదని గూడెం ఏఎంసీ మాజీ ఛైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. గురువారం కొట్టు స్వగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలో దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా వాటి రక్షణకు ఎనలేని కృషి చేసిన కొట్టుపై టీడీపీ, దాని తోక పత్రిక రాద్ధాంతం చేయడం తగదని అన్నారు. దేవాదాయ శాఖామంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొట్టు సత్యనారాయణ ఎన్నడూ అవినీతికి పాల్పడలేదని, పైగా రాష్ట్ర ప్రజల సుభిక్షం కోసం అనేక యాగాలు చేశారని, ఈవిషయం ప్రజలకు తెలుసునని అన్నారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేవాలయ భూముల రక్షణకు 83 ఎమాంట్‌మెంట్ చట్టం తీసుకొచ్చారని, ఫలితంగా అన్యాక్రాతం అవుతున్న భూములను స్వాధీనం చేసుకొని వారిపై క్రిమినల్ కేసులుపెట్టే అధికారం ఉందన్నారు. శ్రీశైలం భూములు అన్యాక్రాంతం కాకుండా కేఎస్ఎన్ కృషి చేసిన సంగతి టీడీపీ నాయకులు గుర్తించాలన్నారు.

భూములు కొట్టేసిన ఘనులు టీడీపీలోనే ఉన్నారు

గూడెం నియోజకవర్గంలో కొందరు టీడీపీ నాయకులు పార్కింగ్ స్థలాలను అక్రమించి అక్రమ కట్టడాలు నిర్మించుకున్నారని, దానిద్వారా కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. గూడెం నియెజకవర్గంలో వలవల బాబ్జితో ఉన్న ఒక నాయకుడు బాల వెంకటేశ్వరస్వామి వారి భూములపై కన్నేసి లేఅవుట్‌లు వేసుకొని విక్రయించి సొమ్ములు చేసుకొన్నారన్నారు. అప్పుడు మున్సిపల్ ఛైర్మన్‌గా ఉన్న నాయకుడు ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్నారని, వీలైతే వారిపై చర్యలు తీసుకోవాలని నాయకులు ధ్వజమెత్తారు. దేవుడికి శఠగోపం పెట్టే ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. బొద్దాని శ్రీనివాస్, వేలిచేటి నరేంద్ర, పాలూరి శివ పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ



తణుకులో అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న వైద్యులు, పోలీసులు

తణుకు: ఆపిల్ కాలేజీ ఆఫ్ నర్సింగ్, తణుకు పట్టణ పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో గురువారం హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆపిల్ హాస్పిటల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ వెంకటేశ్వర థియేటర్ వరకు కొనసాగింది. తొలుత ర్యాలీ ప్రారంభించిన ఆసుపత్రి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వి.సుందరరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మోటారు సైకిళ్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వీటిలో తలకు గాయం వల్ల జరిగే మరణాలు ఎక్కువగా ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రతి ఒక్కరు హెల్మెట్ వినియోగాన్ని అలవాటుగా మార్చుకోవాలన్నారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ జి.సతీష్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారుల్లో మార్పు రావాలంటే కఠిన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాబోయే రోజుల్లో హెల్మెట్ వినియోగించని వారికి భారీగా జరిమానాలు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తణుకు పట్టణ సీఐ ఎం.నాగరాజు హెచ్చరించారు. అనంతరం పలువురు వాహనదారులకు ఆసుపత్రి యాజమాన్యం హెల్మెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ అనుపోజు దినేష్‌బాబు, ప్రిన్సిపల్ సాజీప్రసన్న, పట్టణ ఎస్ఐ అప్పారావు, ట్రాఫిక్ ఎస్ఐ జానా సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవి



తణుకు టౌన్: వేల్పూరులో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మాట్లాడుతున్న సీడీపీవో ప్రమోద కుమారి

తణుకు టౌన్: బిడ్డలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని, అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లిపాలు టీకా లా పని చేస్తుందని తణుకు ఐసీడీఎస్ సీడీపీవో ప్రాజెక్ట్ ఆఫీసర్ బీఎంఎస్ ప్రమోద కుమారి చెప్పారు. గురువారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలలో తల్లిపాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ కే కృష్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింత మహిళలు పాల్గొన్నారు. అలాగే తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిదిలోని పైడిపర్రు సెక్టార్‌లో గల దువ్వ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలలో తల్లిపాలపై అవగాహన కల్పించారు. సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకటలక్ష్మీ మాట్లాడుతూ బిడ్డపుట్టిన ఆరు నెలల వరకూ తల్లిపాలు అందించాలని, ఆరు నెలల తర్వాత మాత్రమే బిడ్డకు అనుబంద ఆహారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా మిషన్ శక్తి, వంద రోజుల కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు, మహిళలు, బాలికలపై జరిగే లైంగిక వేధింపులపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో జ్యోతి స్కూల్ ఆఫ్ నర్సింగ్, ఏరియా ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్య నారాయణ అధ్యక్షత వహించారు. బొలిశెట్టి రాజేష్, లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ సభ్యులచే తల్లులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, వైద్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం(టీఓసీ): నర్సింగ్ విద్యార్థులచే పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బి.వెంకట్రావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మికుల హక్కుల కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బి.వెంకట్రావు పిలుపునిచ్చారు. పట్టణంలోని కోతిబొమ్మ సెంటర్‌లో గురువారం ఐఎఫ్‌టీయూ డివిజన్ కమిటీ రాజకీయ శిక్షణా క్లాసులు నిర్వహించారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి మామిడి దాన వర ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ భారత కార్మిక సంఘాల సమాఖ్య, ఐఎఫ్‌టీయూలు కార్మికుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నాయని చెప్పారు. చట్టాలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్నికి బుద్ధి చెప్పాలన్నారు. అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కోరారు. వివిధ రంగాల్లో పనిచేసేవారికి అన్ని రకాలు సంక్షేమాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, రామ్మోహన్, పి.నాగేశ్వరరావు, గ్రీష్మ, దుర్గాప్రసాద్, ఆర్.ప్రసాద్, ఉదయరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి భద్రతకు ప్రభుత్వాలు సహకరించాలి



తణుకులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న భీమారావు

తణుకు: వీధి విక్రయదారుల సంక్షేమానికి, ఉపాధి భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. గురువారం తణుకు సురాజ్య భవన్‌లో జరిగిన సంచార నాలుగు చక్రాల బండ్ల మిక్చర్, పానీపూరి వర్తక సంఘం సమావేశంలో భీమారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉన్నత చదువులు చదివిన వారు సైతం ప్రభుత్వంపై ఆధారపడకుండా బండ్లపై మిక్చర్, పానీపూరి లాంటి తినుబండారాలు అమ్ముకుంటూ వీధి విక్రయదారులుగా స్వయం ఉపాధి పొందుతున్న వీరికి ప్రభుత్వాలు సబ్సిడీపై బ్యాంకు రుణాలు ఇవ్వాలని, ట్రాఫిక్ అధికారుల వేధింపులు లేకుండా చూడాలని వారి ఉపాధి భద్రతకు సహకరించాలని భీమారావు కోరారు. గత రెండు దశాబ్దాల ముందే కేంద్ర ప్రభుత్వం వీధి విక్రయదారుల సంక్షేమానికి అనేక మార్గదర్శకాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా వీధి విక్రయదారులను గుర్తించి వారికి మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) ద్వారా గుర్తింపు కార్డులు ఇచ్చి సంక్షేమ పథకాలు అమలుకు, అధికారుల వేధింపులు లేకుండా ఉపాధికి భద్రత, చిరు వ్యాపారాల అభివృద్ధికి సబ్సిడితో కూడిన రుణాలు ఇచ్చి వీధి విక్రయదారులను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారని గుర్తు చేశారు. అయితే నేటికీ కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు అమలు కాకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు వీధి విక్రయదారుల సంక్షేమానికి కృషి చేయాలని భీమారావు కోరారు. సంచార నాలుగు చక్రాల బండ్ల మిక్చర్, పానీపూరి వర్తక సంఘం తణుకు శాఖ అధ్యక్షుడు కిలాని శ్రీనివాస్, కార్యదర్శి రేలంగి రాజు, ఉపాధ్యక్షుడు రవి పతి, సహాయ కార్యదర్శి చింతల రామకృష్ణ, కోశాధికారి ముద్దన మురళి కృష్ణ, సభ్యులు నక్కా శ్రీనివాస్, కోటిపల్లి మహేష్, గంటి రాంబాబు, రాయవలస అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

అత్తిలి: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలను పట్టించడం ద్వారా బిడ్డలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని ఐసీడీఎస్ తణుకు ప్రాజెక్టు సీడీపీఓ పి ప్రమోదకుమారి చెప్పారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం అత్తిలి మండలం పాలూరు గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ తల్లులు తమ బిడ్డలకు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించడం ద్వారా బిడ్డ చురుగ్గా ఉంటాడన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.శ్రీదేవి, కృష్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు కె లలితా కుమారి, జి సుకన్య, వి జయకుమారి, ఉపాధ్యాయిని వై మాధవి, సుశీల, ఏఎన్ఎం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు



తణుకు నరేంద్రసెంటర్‌లో పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తణుకు: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 30ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు వెల్లడించిన తీర్పు మాదిగ, ఉపకులాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అబ్బుదాసరి లాజర్ పేర్కొన్నారు. గురువారం తణుకు నరేంద్ర సెంటర్‌లో వేడుకలు నిర్వహించిన నాయకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్, మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తణుకు నియోజకవర్గ అధ్యక్షులు అబ్బుదాసరి కల్యాణ్, యువసేన జిల్లా ఉపాధ్యక్షుడు కడిమి శేఖర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బుదాసరి సోలేమాన్, ఎమ్మార్పీఎస్ నాయకులు తానేటి సుధాకర్, కంకిపాటి వెంకటేశ్వరరావు, యార్లగడ్డ దాసు, దూలపల్లి బ్రహ్మజీ, మల్లిపూడి నరేష్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి పైడికొండల సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు సేవలు అభినందనీయమని పలువురు బీజేపీ నాయకులు కొనియాడారు. కాపు కల్యాణ మండపం వద్ద మాణిక్యాలరావు వర్ధంతిని యువ మోర్చా అధ్యక్షుడు గరగా ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 50 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. నాయకులు ఈతకోట తాతాజీ, నంద్యాల కృష్ణమూర్తి, రామగాని సత్యనారాయణ, తమరాడ చిన్న, అడబాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడేపల్లిగూడెం: 90102 23729, 90100 68395
తణుకు: 90108 43311, 90100 51493
Office mail : tpgadvt@gmail.com